# పొరపాటు

రచన ;
శ్రీ కాళ్ళ గోవిందరావు

'పోస్ట్!' అన్న కేక విన్పించేసరికి, వంటపనులన్నీ ముగించినతరువాత తీరుబడిగావుందని 'కథాంజలి' చదువుతున్న పద్మ వీధిద్వారం దగ్గరకువచ్చి కవరందుకొని మళ్ళీ లోపలికెళ్ళిపోయింది! తన పుట్టింటివాళ్ళు వ్రాసుంటారని సంతోషంతో కవరు చింపి చదువసాగింది!

'డియర్! సూర్యం...!' సంబోధన చదివేసరికి ఎందుకో పద్మకి ఒక అనుమానంవేసింది...ఆ అనుమానాన్ని ఒకప్రక్కకు పెట్టి చదవసాగింది.

'నీతోగడిపిన మధురమైన ఎన్నో వెన్నెలరేయిలు, ప్రస్తుతం నన్నొంటరిదాన్ని చేసి వుడకెత్తిస్తున్నాయ్! ఆ మధురస్మృతులు యింకా మెదులుతూనే వున్నాయ్! ప్రియా! నువ్వు నన్ను పెళ్ళిచేసుకోలేదని నాకేం కోపంలేదు, ఎల్లప్పుడూ నీ స్నేహమాధుర్యంచవి చూస్తుంటే నాకదే పదివేలు, నీ సుందర దివ్యరూపం నా మనోఫలకంపై శాశ్వతంగా ముద్రపడిపోయింది! దాన్నెవ్వరూ చెరపలేరు, చెరపబోరుకూడాను నాకాధైర్యంవుంది! కాని, నువ్వు పెళ్ళైన దగ్గర్నుంచీ నామీద ఎందుకింత చిరుకన్ను వేశావో నాకు తెలియటంలేదు, బహుశా నీ భార్య అందచందాలు నన్నే మరపించివుండవచ్చు, అయినా మొదటిసారి పరిచయస్తుల్ని అంత సులభంగా మరచిపోకూడదు, అందుకే నాలుగ్గెరు రోజుల్లో వచ్చి నీ కౌగిలిలోవాలి, సోలి, ప్రేమామృతాన్ని గ్రోలాలని ఆశగా, ఆరాటంగావుంది, అందుకే వస్తాను.

ఇట్లు,
నీ డార్లింగ్,
'............'

క్రింద పేరుకి బదులుగా రోజాపువ్వువుంది. వుత్తరాన్ని సాంతంగా చదివిన పద్మకి కళ్ళు గిర్రున తిరుగసాగాయి! 'తన ఆస్తిని ఇదివరకే ఎవరో దోచేశారు, కాని మిగిలివున్నదాన్నిగూడా యిప్పుడు దూరంచేయబోతున్నారూ, వీల్లేదూ...' అని అంటూ పిచ్చిగా కేకలు వెయ్యసాగింది పద్మ!

భర్తే దైవమని, సర్వస్వమని నమ్మింది పద్మ! కాని మోసపోయిందని యిప్పుడిప్పుడే తెలిసింది! అందుకే యీ విద్య, చిరాకులు, పరాకులు ఎక్కువయ్యాయి సూర్యంకి, యిందుకోసమే అనుకుంది పద్మ! 'ఛీ! ఈ మగవాళ్ళు అంతాయింతే! వీళ్ళకు మనసులు లేవు కాబోలు, మోములతో సమానంగా సంచరిస్తారు. పెళ్ళికి ముందొకరు, పెళ్ళితరువాతొకరూ...ఆడవాళ్ళంటే ఈ పురుషులదృష్టిలో డబ్బెట్టిగానే రబ్బరు బొమ్మలేమో? లేకపోతే, యీ తెలివితక్కువ పనేమిటి?' వూహిస్తున్నకొలదీ సూర్యంపై ద్వేషం, కసి, అసూయ అసహ్యం మరీ ఎక్కువకాసాగాయి పద్మకి!

'ఇటువంటి చంచల మనస్కులవారితో కాపురం చెయ్యడంకన్నా చనిపోవడమే మంచిదనిపించింది పద్మకి!

కాని పద్మ యిప్పుడు ఒట్టిమనిషి కాదు! అదే ఆమెకు అటువంటి పాడు ఆలోచన రాకుండా అడ్డమయింది!

'రానీ, ఈసాయంత్రం, అటోయిటో, తేల్చిపారేస్తాను' అని అనుకుంటూ లంకిణీలా భర్త రాకకోసం ఎదురుచూస్తూ అటూయిటూ పచార్లుచేయసాగింది పద్మ!

సాయంత్రం ఐదుగంటలవరకూ తనతో కుస్తీపట్టిన ఫైళ్ళకు ఒకసలాంకొట్టి, శ్రీమతిగారి కోర్కెప్రకారం దార్లోస్వాగతం పలుకుతున్న పువ్వుల కొట్టుదగ్గర పువ్వులు కట్టించి హుషారుగా యింట్లో అడుగుపెట్టిన సూర్యారావు భార్యాయొక్క వుగ్ర రూపాన్నిచూసి నీరుగారిపోయాడు!

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా గడిచింది!

'పద్మా! ఏమిటిలావున్నావ్? ఒంట్లో బాగాలేదా?' లాలనగా ఆమె భుజంపై చెయ్యివేసి నిమురుతూ అడిగాడు సూర్యం. విషపురుగుని విడిపించినట్లు పద్మ అతడిచేతిని విదిలించి 'మీరు నన్ను తాకొద్దు, దాన్ని తాకిన ఆచేతులతో నా శరీరాన్ని కలుషితం చెయ్యొద్దు, రెండ్రోజుల్లో అదే వస్తుందిగా, దాంతోనే కాపురం చెయ్యండి, మీమధ్య నేనెందుకు?' ఏడుస్తూ దూరం తొలగింది పద్మ. సూర్యారావు ఆశ్చర్యపోయాడు ఆమె

మాటలు అర్థంకాక. ఆమెను సమీపించి, 'పద్మా! ఏమిటి నువ్వంటున్నది? ఎవరో వ్రాస్తున్నారు. ఎవరితో కాపురం చెయ్యాలి? ఏమిటి పద్మా నీమాటలతీరు?' ఓపిగ్గా, బుజ్జగిస్తూ పూలదండతీసి ఆమె జడలో తురుమ బోయేసరికి విదిలింపుగా ప్రక్కను జరిగిపోయింది. సూర్యారావు చేతిలోని పూలచెండు క్రిందపడింది! అతడిలో సహనం సన్నగిల్లసాగింది! పద్మ ఈరోజు ఎందుకిలా ప్రవర్తిస్తుందో అతడికి అర్థంకావడంలేదు, అసలు విషయమేమిటో తెలియపర్చకుండా అలా ఎందుకు అతణ్ణి అవమానిస్తుందో అతడికి ఎంతకీ పాలుపోవటం లేదు! ఇక మెల్లగా, లాలనగా అడిగితే లాభంలేదను కొని 'పద్మా! నీ ప్రవర్తన శృతి మించిపోతోంది, అసలేం జరిగిందో చెప్పరాదూ?' ముందున్న శాంత స్వరంలో గంభీరత ప్రతిధ్వనించింది అతడి కంఠంలో. పద్మ అతడివైపు కోపంగా చూస్తూ మౌనంగానే వుత్తరాన్ని అతడిపైకి విసిరివేసి మరోవైపు చూస్తూ దుఃఖించ సాగింది! సూర్యం మౌనంగా వుత్తరాన్నందుకొని ఆ మూలాగ్రంగా చదివాడు, కాని అది ఎవరు ఎవరికి వ్రాశారో, ఆ వ్రాసినవారెవరో అతడెంత ఆలోచించినా అర్థంకాలేదు, కవరుమీదున్న అడ్రెస్ చూశాడు. కె ఎస్. రావు, అనివుంది, పొడి అక్షరాల్లో అతడి పేరు అదే, హౌస్ నెంబరు చూశాడు, వీధి పేరుతో సహా సరిపోయింది! వుత్తరాన్ని టేబిల్ మీదపడేస్తూ 'పద్మా! ఈ వుత్తరం ఎవరు ఎవరికి వ్రాశారో నాకర్థం కావడంలేదు, దైవసాక్షిగా చెప్తున్నాను, నువ్వు తప్ప నాకు యింకే ఆడదాని పరిచయంగాని, ప్రేమగాని లేదు, మరి దీన్ని ఎవరు వ్రాశారో నాకూ బోధ పట్టంలేదు...'' నొసటిని వ్రేళ్ళతో రుద్దుకుంటూ అన్నాడు సూర్యం. పద్మయొక్క ప్రవర్తనకి కారణం యిప్పుడిప్పుడే అర్థమవ్వసాగింది సూర్యానికి! అనుమానించటం ఆడవాళ్ళకు ప్రథమవరం! మరి పద్మకూడా స్త్రీయే! కాని ఆలెటర్ తనకెవరు వ్రాశారో దీర్ఘంగా ఆలోచించసాగాడు సూర్యం!

'ఇంకా నాకళ్ళు కప్పాలనా మీ అభిప్రాయం? నేనేం అంత మూర్ఖురాలికాను, అంతగా దానికి మీమీద మనసున్నప్పుడు మరి నన్ను ఎందుకు చేసుకున్నారు? సంఘంకోసమా? లేక సరదాకోసమా?'

పద్మ మాటలకి సూర్యంకి కోపం రెట్టింపవ్వసాగింది! అతడు నిజం చెబుతున్నా ఆమె ధోరణి ఆమెదే! అని బాధపడసాగాడు—'అయితే యింతకీ నీవుద్దేశం?' ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు సూర్యం.

'చిన్నగూటిలో రెండు దీపం బుడ్డీలు యిమరలేవు?' అంది పద్మ.

'రెండోదాన్ని ఎవరైనా తెలియక పెట్టారేమో?'

'అది అసంభవం?' ఒకరి అనుమతిలేనిదే ఎవరూ అలా చెయ్యరు'

'పొరబాటు జరగొచ్చుగా?' నిదానంగానే అన్నాడు సూర్యం.

'పొరపాటు జరిగితే తీసివేయడానికి యిది దీపం బుడ్డీ కాదు, జీవితం' గంభీరంగానే అంది పద్మ.

'అని, నాకూ తెల్సు! కాని నేను నిరపరాధిని!' ఆమెను అనునయించసాగాడు సూర్యం. పద్మ అతడెంత చెప్పినా వినిపించుకోవడంలేదు, సీరియస్‌గానే వుంది—

ఇంతలో అటుగా వెళ్ళిపోతున్న పోస్ట్‌మేన్ వారింటికి వచ్చి 'ఎవరండీ లోపల? మధ్యాహ్నం మీకిచ్చిన కవరు అది మీదికాదు. మీరు యీ యింటిలో దిగక ముందు యిందులోకివున్న కె సూర్యప్రకాశ రావు గారిది, వారి, కె ఎస్. రావు అని పొడిఅక్షరాలమోనే అతడికూడా లెటర్సొస్తే యిచ్చేవాడిని మీ పేరు గూడా కె సూర్యారావు కావడంవలన హౌస్ నెంబరూ వీధి నెంబరూ సరిపోవడంవలన మీకు యిచ్చేశాను. ఇప్పుడు ప్రకాశరావుగారు అడుగుతున్నాడు' అని ఏకరువుపెట్టి పద్మ అందించిన కవరందుకొని వెళ్ళి పోయాడు పోస్ట్‌మేన్!

నిజం తెల్సుకున్న ఆయిద్దరు దంపతులూ ఒకర్నొకరూ చూసుకుంటూ, ఫక్కున నవ్వుకున్నారు. పద్మ, క్షమించమన్నట్లు దీనంగా చూస్తూ సూర్యాన్ని వాటేసుకుంది.

